ప్రజాశక్తి

సోమవారం 1 జనవరి 2024



నూతన సంవత్సర శుభాకాంక్షలు





ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లా ప్రజలకు పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి కెవి.ఉషాశ్రీచరణ్ రాష్ట్ర ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఉప్పొంగిన ఉత్సాహంతో ప్రతి ఒక్కరూ కొత్త ఏడాదికి స్వాగతం పలకాలన్నారు. కొత్త సంవత్సరం ప్రతి ఒక్కరి జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని కలెక్టర్ ఎస్.గౌతమి ఆకాంక్షించారు. 2024 నూతన సంవత్సరంలో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. జనవరి 1వ తేదీన ఉదయం 09:30గం॥ నుంచి 12:30 గంటల వరకు కలెక్టరేట్లోని రెవెన్యూ భవనంలో అందుబాటులో ఉండనున్న కలెక్టర్ తెలిపారు.

పారిశుధ్య కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన

అనంతపురం కార్పొరేషన్ కార్యాలయం వద్ద అర్ధనగ్న ప్రదర్శనతో నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు



సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పారిశుధ్య కార్మికులు చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. ఆదివారం నాటికి సమ్మె చేపట్టి 6వ రోజుకు చేరుకుంది. నిరసనలో భాగంగా అన్ని మున్సిపల్ కార్యాలయాల వద్ద కార్మికులు అర్ధనగ్న ప్రదర్శన చేశారు. కాంట్రాక్టు అవుట్‌సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని, సమానపనికి సమాన వేతనం ఇవ్వాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమాల్లో సిఐటియు నాయకులు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

వార్త 6లో

నల్లదుస్తులతో ఎస్ఎస్ఎ ఉద్యోగుల నిరసన

అనంతపురం కలెక్టరేట్ ఎదుట నల్లదుస్తులు ధరించి నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు



తమను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ సమగ్ర శిక్షా అభియాన్ శాఖలోని అన్ని విభాగాల కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు నల్ల దుస్తులు ధరించి బ్లాక్‌డేగా భావిస్తు నిరసన తెలిపారు. న్యాయమైన సమస్యల పరిష్కారం కోరుతూ ఎస్ఎస్ఏ కలెక్టరేట్ ఎదుట చేపట్టిన సమ్మె ఆదివారం 12వ రోజుకు చేరుకున్నాయి. ఎస్ఎస్ఏ కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల జేఏసి చైర్మన్ కె.విజయ్ అధ్యక్షతన నిర్వహించిన సమ్మెకు యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు గోవిందరాజులు, జిల్లా నాయకులు నాగేంద్ర, ఏపిటిఎఫ్, ఎస్‌టియు నాయకులు, జనసేన జిల్లా కార్యదర్శి పత్తి చంద్రశేఖర్ మద్దతుగా హాజరయ్యారు. ప్రభుత్వం స్పందించి న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

'న్యూ'తన సందడి

కాలగమనంలో మరో సంవత్సరం కలసిపోయింది. 'కొత్త' ఆశలు మొలకెత్తాయి. ఆకాంక్షలు ఊగిసలాడాయి. వ్యాపకాలు దారి మార్చుకున్నాయి. సాధ్యాసాధ్యాలను పక్కనబెడితే మనసు కొత్త ఉత్సాహంతో సందడి చేసింది. కొత్త కాంతులు.. కోటి ఆశలతో 'న్యూ'తనోత్సహం నెలకొంది. 2023కు వీడ్కోలు పలుకుతూ 2024కు స్వాగతం పలుకుతూ అందరిలోనూ జోష్ కనిపించింది. గతేడాది కష్టాలు ఒక జ్ఞాపకంగా వదిలేసి... ఆశల అడుగులు ఆగకుండా గుండెనిండుగా 2024కు ఉమ్మడి జిల్లా వాసులు స్వాగతం పలికారు.

- ◆ కొత్త ఆశలతో 2024కు స్వాగతం
- ◆ రోడ్లపై యువత ఆనంద హేల
- ◆ ప్రత్యేక ఆకర్షణలో బహుమతులు
- ◆ ఆకట్టుకుంటున్న పూల బొకేలు
- ◆ నోరూరించేలా స్వీట్ ప్యాక్‌లు







ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

2023 సంవత్సరంలోని చేదు,తీపి జ్ఞాపకాలకు వీడ్కోలు పలుకుతూ 2024కు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా స్వాగతం పలికారు. పాతేడాదికి వీడ్కోలు.. కొత్త ఏడాదికి స్వాగతం పలుకుతూ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆదివారం నాడు అర్ధరాత్రి వరకు వేడుకలు జరిగాయి. నూతన సంవత్సర వేడుకలను సంబరంగా జరుపుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు జరిగాయి. నగరాలు, పట్టణాల్లో హోటళ్ళు, బేకరీలు, స్వీట్ షాపులు పెద్దఎత్తున అలకరించబడ్డాయి. ఆఫర్లు సైతం పెద్దఎత్తున ప్రకటించారు. కొన్ని సంస్థలైతే నూతన సంవత్సరం వేడుకలను పురస్కరించుకుని ప్రత్యేకమైన కార్యక్రమాలు నిర్వహించాయి. స్నేహితులు, సన్నిహితులు వారికి అనువైన ప్రాంతాల్లో అర్ధరాత్రి వరకు వేడుకలు జరుపుకుని కేక్‌లను 12 గంటల సమయంలో కట్ చేసుకుని నూతన సంవత్సరం శుభకాంక్షలు తెలుపుకున్నారు. దీంతో అన్ని ప్రధాన పట్టణాల్లోనూ అర్ధరాత్రి వరకు సందడి నెలకొంది.

కలసిరాని 2023

2023 సంవత్సరం పెద్దగా కలసిరాలేదు. ప్రకృతి పరంగా చూసుకున్నా.. అభివృద్ధి పరంగా చూసుకున్నా సామాన్యులు ఇబ్బందులనే ఎదుర్కొన్నారు. 2022లో అధిక వర్షాలతో రైతాంగం తీవ్రంగా నష్టపోతే 2023 సంవత్సరం వర్షాభావం వ్యవసాయాన్ని కుదేలే చేసింది. 30 శాతానికిపైగా రెండు జిల్లాల్లోనూ వర్షాభావం నెలకొంది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం 49 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించింది. ఈ కరువు ప్రభావం నూతన సంవత్సరం 2024లోనూ కొనసాగే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. సాగునీరు కూడా ఈసారి తక్కువగా రావడంతో ఆయకట్టు కింద సాగు చేసిన మిర్చి రైతులకు నూతన సంవత్సరంలోనూ సమస్యలు ఎదుర్కొనే పరిస్థితులే కనిపిస్తున్నాయి.

రాజకీయ వేడి

నేడు మొదలయ్యే 2024 సంవత్సరంలో ఎన్నికలు రానున్నాయి. ఈ ప్రభావం 2023 ఆఖరు నుంచే మొదలైంది. రాబోయే ఎన్నికలు కొన్ని నెలలు మాత్రమే ఉండటంతో గడిచిన రెండు, మూడు మాసాలుగా రాజకీయ వాతవరణం వేడెక్కి ఉంది. ఇక ఈ రోజుతో ఇవి మరింత వేగం పుంజుకునే అవకాశాలున్నాయి. ఇక నెలల నుంచి రోజుల్లోకి ఎన్నికల సమయం లెక్కించాల్సి ఉంటుంది. 2024 సంవత్సరం మాత్రం కొంత మంది రాజకీయ నాయకుల భవితవ్యాన్ని నిర్ధేశించనుంది. రాజకీయ నేతలతో ఈ సంవత్సరం అత్యంత ప్రాధాన్యతతో కూడుకున్న సంవత్సరం కానుంది. ఇక ఎన్నిలకు దగ్గరపడుతున్న కొద్ది కార్మిక పోరాటాలు పెరుగుతున్నాయి. ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఉద్యోగులు, కార్మికులు పెద్దఎత్తున పోరాటాలకు దిగారు. ఆదా నేటితో మరింత పదునెక్కనున్నాయి. ఈ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం ఏ రకంగా స్పందిస్తుందో చూడాల్సి ఉంది.

పాల ఉత్పత్తులతో లాభం

పాడి రైతులకు ప్రోత్సాహం

జిల్లా కో-ఆపరేటివ్ అధికారి ఆర్.కృష్ణానాయక్



ఆర్.కృష్ణానాయక్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

'పాడి పరిశ్రమకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోంది. పాల ఉత్పత్తుల ద్వారా రైతులకు ఎంతో లాభం చేకూరుతుంది.' వ్యవసాయానికి పాడి పరిశ్రమ అనుసంధానం ఉంటుంది. గ్రామీణ ప్రాంతాల్లో చాలామంది రైతులు పాడి పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నారు. ప్రభుత్వ వారికి తగిన చేయూతనిస్తూ, పాడి పరిశ్రమ అభివద్ధికి కషి చేస్తోంది. గతంలో పాలకు తగిన మార్కెటింగ్ సౌకర్యం లేక కేవలం గ్రామంలో లేదా సమీప పట్టణాలకు వెళ్లి పాలు అమ్ముకునే పరిస్థితి ఉండేది. ప్రస్తుతం డైయిరీ అభివద్ధి సంస్థ ప్రభుత్వం అనుసంధానంతో అమూల్ పరిశ్రమకు నేరుగా పాలను విక్రయించుకునే అవకాశం ఉంది. గ్రామాల్లో పాల ఉత్పత్తుల సొసైటీలు ఏర్పాటు చేసుకుని తద్వారా పాల ఉత్పత్తులను అమూల్ డైయిరీ కంపెనీ కొనుగోలు చేస్తుంది. ఎడిసిసి బ్యాంకులో దీర్ఘకాలిక సల్పకాలిక రుణాలు పొందే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది'. అనిజిల్లా డైయిరీ కో-ఆపరేటివ్ అధికారి ఆర్.కృష్ణనాయక్ తెలిపారు. ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖిలో ఆయన పలు విషయాలను వెల్లడించారు.

ప్రశ్న:జిల్లాలో ఎన్ని గ్రామాల నుంచి పాలను సేకరిస్తున్నారు? వివరాలు తెలపండి.?

జవాబు: ప్రస్తుతం జిల్లాలో 7 మండలాల నుంచి 127 గ్రామాల్లో 27 వేల లీటర్ల పాలను అమూల్ సంస్థ సేకరిస్తోంది. కదిరి, తలపుల, ఎన్‌పి.కుంట, గాండ్లపెంట, ఒడిసి, నల్లచెరువు, తాడిమర్రి మండలాల నుంచి పాలను సేకరిస్తున్నాం. త్వరలో చిలమత్తూరు, పరిగి, లేపాక్షి, హిందూపురం మండలాల్లోని గ్రామాల్లో పాల సేకరణ కేంద్రాలు ఏర్పాటు కానున్నాయి.



ప్రశ్న:పాల సేకరణ, వాటి పర్యవేక్షణ వివరాలు తెలపండి?

జవాబు: పాల ఉత్పత్తి పరస్పర సహకార సంఘాలు ఉంటాయి. ఆ సంఘాలతో పాటు తాము పశుసంవర్ధక శాఖ అధికారులు పర్యవేక్షిస్తుంటాం. ప్రస్తుతం జిల్లాలో 40 సొసైటీలు ఉన్నాయి. అందులో మహిళలే నాయకత్వం వహిస్తుంటారు. అమూల్ కంపెనీ ప్రతినిధులు ఆయా గ్రామాల సహకార పాల సొసైటీ ద్వారా పాలను రోజు సేకరిస్తుంటారు. వెన్న శాతం బట్టి ధరలు ఉంటాయి. ఆవు పాలు అయితే 30 నుంచి 50 వరకు లీటర్ పాలకు ధర చెల్లిస్తారు. అదే గేదె పాలు అయితే 40 నుంచి 50 వరకు లీటర్ పాలుకు చెల్లిస్తారు. పది రోజులకు ఒకసారి లబ్ధిదారులకు బ్యాంకు ఖాతాల్లోకి డబ్బులు జమ చేస్తారు. సేకరించిన పాలను బల్క్ మిల్క్ కేంద్రాలకు చేరవేస్తారు. మదనపల్లి, తిరుపతిలో ఈ కేంద్రాలు ఉంటాయి.

ప్రశ్న:-మీ శాఖ పరంగా రైతులకు మీరు అందిస్తున్న సహకారం ఏమిటి?

జవాబు: కో-ఆపరేటివ్ సొసైటీల ద్వారా రైతులకు అవగాహన కల్పిస్తాం. బ్యాంకు రుణాలు అందే విధంగా చర్యలు తీసుకుంటాం. రైతులకు భూమి ఉంటే బ్యాంకులు తనఖా పెట్టుకుని ఎల్‌టి రుణాలు 4 నుంచి 5 లక్షల రూపాయల వరకు రుణాలు సబ్సిడీపై అందిస్తారు. అదే సల్ప కాలిక రుణాలు అయితే రూ.40 వేల నుంచి రూ.50 వేల వరకు బ్యాంకు రుణాలు ఇస్తాయి. పశుసంవర్ధక శాఖ వైద్యుడు ధ్రువీకరణ పత్రం రైతులకు అందాల్సి ఉంది. ఎలాంటి మోసాలు లేకుండా తమ పాల ఉత్పత్తులను విక్రయించుకోవచ్చు. దానిక్కూడా సబ్సిడీపై అందిస్తాం.

ప్రశ్న:రైతులకు మీరు ఇచ్చే సలహాలు సూచనలు ఏమిటి? సిబ్బంది కొరత ఉందా?

జవాబు:పాడి పరిశ్రమకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి. మహిళా రైతు సొసైటీల ద్వారా మరింత అభివద్ధి చెందాలని కోరుకుంటుంది. సిబ్బంది కొరత అంటూ ఏమీ లేదు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో పశుసంవర్ధక శాఖ అధికారులు తాము సంయుక్తంగా పర్యవేక్షిస్తుంటాం



ఖాళీ బిందెలతో రాస్తారోకో చేస్తున్న రాయదుర్గం కోతిగుట్ట కాలనీవాసులు

తాగునీటి కోసం రోడ్డెక్కిన మహిళలు

ప్రజాశక్తి-రాయదుర్గం

తాగునీటి కోసం ఆదివారం సాయంత్రం పట్టణంలోని కోతిగుట్ట కాలనీవాసులు ఖాళీ బిందెలతో రోడ్డుపై రాస్తారోకో చేపట్టారు. కాలనీవాసులు మాట్లాడుతూ వారం, పది రోజులుగా తాగునీరు సరఫరా చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. కాల కృత్యాలు ఎలా తీర్చుకోవాలి, జీవనం ఎలా గడపాలని నిలదీశారు. అధికారులు, ప్రజాప్రతినిధుల తీరుపై మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖాళీ బిందెలతో రోడ్డుపై బైఠాయించి వాహనాల రాకపోకలను అడ్డుకున్నారు. అలాగే మున్సిపల్ కార్మికులు సమ్మెలో ఉన్న కారణంగా పాలకవర్గం, మున్సిపల్ అధికారులు పారిశుధ్యం నిర్వహణకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని వారు కోరారు.

ఘనంగా ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం



ఎస్ఎఫ్ఐ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-గుత్తి

భారత విద్యార్థి సమాఖ్య(ఎస్ఎఫ్ఐ) 54వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ ఎస్సీ బాలికల వసతి గృహంలో ఎస్ఎఫ్ఐ జెండాను ఆవిష్కరించారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు సి.రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్య పరిరక్షణే లక్ష్యంగా ఎస్ఎఫ్ఐ పోరాడుతోందన్నారు. జాతీయ నూతన విద్యా విధానంతో పేద విద్యార్థులు చదువుకు దూరం అవుతారన్నారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాటాలు కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఎస్సీ బాలికల వసతి గృహం వార్డెన్ చంద్రకళ, విద్యార్థి సంఘాల నాయకులు దర్శన్, రాజేష్, పవన్‌గౌడ్, అఖిల్, నందినిబాయి, లక్ష్మీ, శిరీష, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాను అడ్డుకుంటా

తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జెసి.ప్రభాకర్ రెడ్డి

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్

తాడిపత్రి పెన్నా నది పరివాహక ప్రాంతాల నుంచి అక్రమంగా బిల్లులు లేకుండా చేస్తున్న ఇసుక రవాణాను తక్షణమే ఆపేయాలని, లేకుంటే తాము అడ్డుకుంటామని తాడిపత్రి మున్సిపల్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే జెసి.ప్రభాకర్‌రెడ్డి తెలియజేశారు. ఆదివారం మండల పరిధిలోని వీరాపురం గ్రామ సమీపంలో పెన్నానది నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న టిప్పర్లను గ్రామస్తుల సాయంతో జెసి.ప్రభాకర్ రెడ్డి అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమంగా ఇసుక రవాణా చేస్తూ గ్రామస్తులను ఇబ్బంది పెడితే తక్షణమే ఇసుక రవాణా చేస్తున్న వాహనాల టైర్ల నుంచి గాలి తీసేయాలని గ్రామస్తులకు తెలియజేశారు. పెన్నా నది నుంచి ఇసుక తోడుతున్న హిటాచి, రెండు టిప్పర్లను అడ్డుకుని అక్కడే ఆపేశారు. ఈ విషయం తెలుసుకున్న రూరల్ పోలీసులు టిప్పర్లకు సచివాలయం ద్వారా ఇచ్చిన బిల్లులు ఉన్నాయంటూ సిఐ లక్ష్మికాంత్ రెడ్డి జెసి ప్రభాకర్ రెడ్డికి తెలిపారు. సచివాలయ అధికారులు, తహశీల్దార్, రాయల్టీ అధికారుల నుంచి అనుమతి పత్రాలు చూపించేంత వరకు వాటిని కదలనివ్వమని పోలీసులకు జెసి తెలిపారు. ఉన్నతాధికారాల నుంచి సరైన అనుమతులతో ఉన్న పత్రాలు చూపించేంత వరకు హిటాచీ, టిప్పర్లను రూరల్ పోలీస్ స్టేషన్ వద్ద ఉంచాలన్నారు. అక్రమ ఇసుక రవాణాను అడ్డుకోని పక్షంలో జనవరి 2వ తేదీన పోలీస్ స్టేషన్, తహశీల్దార్, రాయల్టీ కార్యాలయాల వద్ద ఆందోళన చేపడతామని జెసి తెలిపారు.



వీరాపురం గ్రామస్తులతో మాట్లాడుతున్న పోలీసులు

ప్రజాధనం దోచుకునేందుకే అర్ధరాత్రి వరకూ మద్యం విక్రయాలు : ఐద్వా



ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వం ప్రజా ధనం దోచుకోవడానికే డిసెంబర్ 31, జనవరి 1వ తేదీ అర్ధరాత్రి వరకు మద్యం అమ్మకాలకు అనుమతి ఇచ్చిందని, ఇది అత్యంత సిగ్గుమాలిన పని అని ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శ్యామల, రాజేశ్వరిలు ఆగ్రహం వ్యక్తం చేశారు. డిసెంబర్ 31, జనవరి 1వ తేదీల్లో రెండు రోజుల పాటు అర్ధరాత్రి వరకు మద్యం అమ్మకాలకు అనుమతించడాన్ని ఐద్వా కమిటీ తీవ్రంగా ఖండించింది. ఆ సంఘం రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి మాట్లాడుతూ నూతన సంవత్సరం వేడుకల నేపథ్యంలో ధనార్జనే లక్ష్యంగా రాష్ట్రంలోని అన్ని మద్యం షాప్‌లు అర్ధరాత్రి 12 గంటల వరకు పని చేస్తాయని ఎక్సైజ్ అధికారులు ప్రకటించడం దారుణంగా ఉందన్నారు. బార్ షాపులు, క్లబ్‌ల అనుమతితో జరిగే ఈవెంట్స్‌లో రాత్రి 1 గంటల వరకు మద్యం విక్రయాలకు అనుమతిని ఇస్తూ ఎక్సైజ్ అధికారులు ఆదేశాలు జారీ చేయటం వల్ల మహిళలు, పిల్లలను ఇబ్బందులకు గురి చేయడమే అన్నారు. మాట తప్పని జగన్ మద్యనిషేధం హామీని ఇచ్చి మద్యాన్ని ఇలా భారీగా అమ్మించడానికి పూనుకోవడం ఏవిలువలకు నిదర్శమని ప్రశ్నించారు. అక్కా చెల్లెమ్మల కన్నీళ్లతో రూ.26వేల కోట్ల ఆదాయాన్ని పొందుతున్నారని విమర్శించారు. మద్యన్ని నిషేధం చేసి ఓట్లు అడగడానికి వస్తానన్న జగన్‌కు ఆడబిడ్డల ఓట్లు అడిగే నైతిక హక్కు లేదన్నారు. మాట తప్పిన జగన్‌కు వచ్చే ఎన్నికల్లో ఇంటిదారి చూపి మహిళలు తగిన గుణపాఠం నేర్పిస్తారని హెచ్చరించారు.

ఆర్ఇఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

రిజర్వేషన్ ఎంప్లాయిస్ ఫెడరేషన్(ఆర్ఇఎఫ్) జిల్లా నూతన కార్యవర్గం ఎన్నికైనట్లు ఆర్ఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జి.నాగభూషణ తెలిపారు. ఆదివారం లిటిల్‌ఫ్లవర్ స్కూల్‌లో ఆర్ఈఎఫ్ సమావేశం నిర్వహించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆర్ఈఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా మూడవసారి రాజావత్ నారాయణ నాయక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆర్ఈఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులుగా పి.కష్ణయ్య, ఎం.లక్ష్మీనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శిగా టి.ఆదినారాయణ, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శిగా ఎన్.రాఘవేంద్రరావు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా టి.రాజారమేష్, జిల్లా ప్రచార కార్యదర్శులుగా ఏ.రామగోపాల్, జయపాల్, జిల్లా ఉపాధ్యక్షులుగా బి.నారాయణప్ప, ఈ.రంగనాథ్, ఏ.నాగభూషణం, బి.ఆనంద్ నాయక్, వి.బాపూజీ నాయక్, ఆర్.మల్లికార్జున, వరదరాజులు, ఆర్.మహేష్ నాయక్, జిల్లా కార్యదర్శులుగా కోట్ల నారాయణస్వామి, కె.బాలాజీ నాయక్, జిల్లా ఆర్థిక కార్యదర్శిగా ఆర్.నాగేంద్ర, జిల్లా ఆడిటర్‌గా ఏ.కిష్టప్పలను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా కమ్మన్న, జె.రామన్న, సురేష్, ఆర్ఈఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాసులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.ఓబులేశు, బి.రాజశేఖర్, ఉమాశంకర్, ఎం.శ్రీరాములు పాల్గొన్నారు.



ఆర్ఇఎఫ్ నూతన కమిటీ సభ్యులు

మున్సిపల్ కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన



రాయదుర్గంలో రోడ్డుపై అర్ధనగ్నంగా నిరసన వ్యక్తం చేస్తున్న మున్సిపల్ కార్మికుల

సమ్మెలో భాగంగా ఆరో రోజైన ఆదివారం మున్సిపల్ కార్మికులు అనంతపురం నగరంతో పాటు జిల్లాలోని మున్సిపాలిటీల్లో వివిధ రూపాల్లో నిరసన వ్యక్తం చేశారు. అర్ధనగ్నంగా మోకాళ్లపై నిల్చొని నమస్కారాలు చేశారు. నిరసన ర్యాలీలు చేపట్టారు. ప్రధాన కూడలిలో మానవహారంగా ఏర్పడి నిరసన వ్యక్తం చేశారు.

'అనంత'లో దిగివచ్చిన పాలకవర్గం, యంత్రాంగం
మున్సిపల్ కార్మికులతో చర్చలు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

పోటీ కార్మికులతో పని చేయిస్తే అనంత మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయాన్ని చెత్తమయం చేస్తామని మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం హెచ్చరించడంతో పాలకవర్గం, అధికార యంత్రాంగం మెట్టు దిగి వచ్చింది. నగరంలోని మేయర్ ఛాంబర్‌లో ఆదివారం మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం నేతలతో మేయర్ మహమ్మద్ వసీం, కమిషనర్ భాగ్యలక్ష్మి, హెల్త్ ఆఫీసర్ సంగం శ్రీనివాసులు, డిప్యూటీ మేయర్లు చర్చలు జరిపారు. చర్చలకు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్ర, మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎటిఎం నాగరాజు, కె.నాగభూషణం, సిఐటియు నగర కార్యద ర్శి వెంకటనారాయణ, తదితరులు హాజరయ్యారు. నాయకులు మాట్లాడుతూ జెసిబిలు, ట్రాక్టర్లు, ప్రయివేట వ్యక్తులకు లక్షలాది రూపాయలు చెల్లించే బదులు కార్మికుల గురించి ఆలోచించా లన్నారు. పాలకవర్గం, మున్సిపల్ అధికారులు మాట్లాడుతూ కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. కోవిడ్, మలేరియా, గార్బేజ్ కార్మికులకు రూ. 15వేల వేతనం ఇస్తామన్నారు. నగర జనాభాకు అనుగుణంగా 50 మంది కార్మికుల ను తీసుకుంటాం, ఇంజినీరింగ్ సెక్షన్‌లో తొలగించిన 11 మంది కార్మికుల కుటుంబాల్లో ఒకరికి ఉపాధి కల్పిస్తాం, అదనంగా 10 మందిని విధుల్లోకి తీసుకుంటామని హామీ ఇచ్చారు. సిఐటియు నాయకత్వం మాట్లాడుతూ రాష్ట్ర నాయకత్వంతో చర్చలు జరిపిన తర్వాతనే మాట్లాడుతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నగర అధ్యక్షులు బండారి స్వామి, మిత్ర సంఘం ఎం.నల్లప్ప, మహిళా కన్వీనర్ మంత్రి వరలక్ష్మి, లక్ష్మీనరసమ్మ, ఇంజినీరింగ్ సెక్షన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, మల్లి, రాయుడు, నగర కార్యదర్శి ఓబుళపతి, ట్రెజర్ పోతలయ్య, జిల్లా కమిటీ సభ్యులు ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.



అనంతపురంలో మున్సిపల్ కార్మికుల దీక్షలో మాట్లాడుతున్న నాయకులు

కార్మికులను రెచ్చగొట్టడం సరికాదు : ఎమ్మెల్యే అనంత

నగరంలో జెసిబిలు, ట్రాక్టర్లు, పోటీ కార్మికులతో చెత్త తరలించేందుకు మున్సిపల్ కార్పొరేషన్ పాలకవర్గం, కమిషనర్ చేసిన ప్రయత్నాలపై ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఇదే విషయమై మేయర్ మహమ్మద్ వసీం, కమిషనర్ భాగ్యలక్ష్మి, హెల్త్ ఆఫీసర్ సంఘం శ్రీనివాసులును పిలిచి అక్షింతలు వేసినట్లు తెలుస్తోంది. కార్మిక వర్గాలతో సామరస్య పూర్వకంగా వెళ్లాలి కానీ కక్ష సాధింపు చర్యలు, మొండి వైఖరి అనుసరించటం తగదని సూచించారు. ఇకపై ఇలాంటి దుందుడుకు చర్యలకు పాల్పడవద్దని సుతి మెత్తగా మందలించినట్లు సమాచారం.

కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన

డిమాండ్ల సాధనకై సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ ఉద్యోగ, కార్మిక సంఘం నాయకులు ఆదివారం నగరంలోని మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట అర్ధనగ్నంగా మోకాళ్లపై నిల్చొని నమస్కారాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం ఆమోదించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

కార్మికుల సత్తా చూపుతాం..
మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం నేత ఎటిఎం నాగరాజు

నగరంలో ఆదివారం తెల్లవారుజామున జెసిబిలు, ప్రయివేటు ట్రాక్టర్లు పెట్టి చెత్తను తరలించ డంపై మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎటిఎం నాగరాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజారోగ్యం దృష్ట్యా పాలకవర్గం కార్మిక సంఘాలను పిలిచి చర్చించి ఉంటే బాగుండేదన్నారు. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తూ కార్మికుల సమ్మెకు వ్యతిరేకంగా ప్రయివేట్ వ్యక్తులు, యంత్రాలతో చెత్తను తరలించేయత్నం చేయడం దారుణమన్నారు. ప్రయివేట్ వ్యక్తులు, కార్మికుల మధ్య అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకుంటే బాధ్యత ఎవరిదని ప్రశ్నించారు. పాలకవర్గం, కమిషనర్ మొండి వైఖరితో ముందుకు సాగితే నగరంలోని చెత్తను తీసుకెళ్లి మున్సిపాలిటీలో వేస్తామన్నారు. ఆదివారం సాయంకాలంలోగా చర్చలకు పిలవని పక్షంలో ప్రజాప్రతినిధుల ఇళ్లలో సైతం చెత్త వేస్తామని హెచ్చరించారు. కమిషనర్, ఎమ్మెల్యే, పాలకవర్గం మొండిగా వ్యవహరిస్తే జెఎసి ఆధ్వర్యంలో కార్మికుల సత్తా చూపిస్తామని హెచ్చరించారు.

తాడిపత్రి : సమ్మెలో భాగంగా తాడిపత్రి పట్టణంలో మున్సిపల్ కార్మికులు అర్ధ నగ్న ప్రదర్శన నిర్వహించారు. కార్మిక నాయకులు మాట్లాడుతూ సిఎం జగన్ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. దీక్షలో సిఐటియు పట్టణ అధ్యక్షులు రామాంజనేయులు, ఇంజినీరింగ్ సెక్షన్ అధ్యక్ష, కార్యదర్శులు, ఉపాధ్యక్షులు జుబేర్, ఓబయ్య, జిపి ప్రసాద్, మహబూబ్‌బాషా, పారిశుధ్య కార్మికుల కార్యదర్శి, కోశాధికారి వన్నూరప్ప, నారాయణ, జిల్లా కమిటీ మెంబర్ ధనలక్ష్మి, నాగలక్ష్మి, మున్సిపల్ కార్మికులు, ఆఫీస్ సిబ్బంది, కంప్యూటర్ ఆపరేటర్లు, అటెండర్లు, డ్రైవర్లు, ఎలక్ట్రీషన్, టౌన్ ప్లానింగ్ సెక్షన్ కార్మికులు, యుజిడి కార్మికులు పాల్గొన్నారు.

గుత్తి : మున్సిపల్ కార్మికులు అర్ధనగ్నంగా మోకాళ్లపై నిల్చొని వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శిబిరం వద్ద కార్మికులు వంటా వార్పు కార్యక్రమం నిర్వహించారు. దీక్షలో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎన్. రామాంజనేయులు, కె.సూర్యనారాయణ, ఉపాధ్యక్షుడు కె.మహేష్, సహాయ కార్యదర్శి సుంకన్న, కోశాధికారి బాలరంగన్న, నాయకులు బి.నాగేంద్ర, ఈశ్వరయ్య కె.ఆంజనేయులు, పి.ఆంజనేయులు, ఇంజినీరింగ్ సెక్షన్ ఉపాధ్యక్షుడు ఎస్.రాజా, కార్యదర్శి రవిశంకర్, నాయకులు మురళి, నరసింహ, శేఖర్, ఓబులేసు, తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లు : మున్సిపల్ పారిశుధ్య, ఇంజినీరింగ్ కాంట్రాక్టు కార్మికులు ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు కె.నరసయ్య, పట్టణ అధ్యక్షుడు జగదీష్, కార్యదర్శి సూరి, సిఐటియు పట్టణ అధ్యక్షుడు కసాపురం రమేష్ ఆధ్వర్యంలో పట్టణంలోని పొట్టి శ్రీరాములు కూడలిలో మానవహారం చేపట్టారు. ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో నాయకులు మస్తాన్, రాకెట్ల మస్తాన్, రంగనాయకులు, మల్లేష్, తిమ్మప్ప, రమణ, హనుమంతు, తదితరులు పాల్గొన్నారు.

స్పందించేంత వరకూ సమ్మెను ఆపేదే లేదు..
సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి బి.మల్లికార్జున

రాయదుర్గం : మున్సిపల్ ఔట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలపై స్పందించేంత వరకూ సమ్మెను ఆపేదే లేదని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి బి.మల్లికార్జున స్పష్టం చేశారు. ముందుగా మున్సిపల్ కార్మికులు పట్టణంలోని వినాయక కూడలి నుంచి సమ్మె శిబిరం వరకూ అర్ధనగ్న ప్రదర్శనగా ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ సమ్మె పట్ల అసత్య ప్రచారాలు మాని తక్షణమే సమస్యలు పరిష్కరించాలని, లేనిచో సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు రాము, తిప్పే స్వామి, మల్లేష్, తిప్పేరుద్ర, మైలారప్ప, నరసింహులు, పారిశుధ్య ఇంజినీరింగ్ కార్మికులు పాల్గొన్నారు.



అనంతపురంలో సంఘాల నాయకులతో చర్చిస్తున్న మేయర్ వసీం



గుత్తిలో అర్ధనగ్నంగా మోకాళ్లపై నిల్చొని నిరసన తెలుపుతున్న కార్మికులు



తాడిపత్రిలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న కార్మికులు



గుంతకల్లులో నిరసన ర్యాలీ చేపట్టిన మున్సిపల్ కార్మికులు

చేసిన మంచిని వివరించేందుకే వైసిపి బస్సుయాత్ర

మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

ప్రజాశక్తి-ఉరవకొండ

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలతో పాటు అన్ని వర్గాల ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం చేసిన మంచిని వివరించేందుకే వైసిపి ఆధ్వర్యంలో 'సామాజిక సాధికార బస్సు యాత్ర' చేపడుతున్నామని నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛారిజ వై.విశ్వేశ్వరరెడ్డి తెలిపారు. జనవరి 7వ తేదీ పట్టణంలో బస్సుయాత్ర నిర్వహిస్తున్న నేపథ్యంలో ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో విశ్వ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ జనవరి 7వ తేదీ సాయంత్రం 3 గంటలకు పాత బస్టాండ్ ప్రాంతంలో బస్సు యాత్ర ఉంటుందన్నారు. యాత్రకు మంత్రి పెద్దిరెడ్డి, డిప్యూటీ సిఎం అంజాద్ బాషా, మంత్రులు విడదల రజని, ఉషశ్రీచరణ్, కారుమూరు నాగేశ్వరరావు, ఎంపి నందిగం సురేష్‌తో పాటు పలువురు ఎంపిలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యే లు, నేతలు హాజరవుతారన్నారు. కావున ప్రజలు, పార్టీ శ్రేణులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ బిసి విభాగం జిల్లా అధ్యక్షుడు వీరన్న, ఎంపిపి నరసింహులు, పట్టణ అధ్యక్షుడు ఎసి ఎర్రిస్వామి, పంచాయతీ రాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు బసవరాజు, మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ సుశీలమ్మ, పిఎసిఎస్ ఛైర్మన్ వడ్డ షేక్షావలి, కురుబ, ఎంబిసి కార్పొరేషన్ డైరెక్టర్లు గోవిందు, వెంకటేష్, నాయకులు తిప్పయ్య, అశోక్‌కుమార్, ఆసిఫ్, ఎంపిటిసిలు ఈడిగ ప్రసాద్, హొన్నూరుసాబ్, శర్మాస్, చేనేత నాయకులు ఎంసి నాగభూషణం, చంగల మహేష్, గట్టు ఎర్రిస్వామి, నిమ్మల వెంకటరమణ, కొత్తపల్లి హరి, ఆటో శీన, అయ్యర్ దాదు, భీమేష్, ఓబులేసు, తదితరులు పాల్గొన్నారు.



బస్సు యాత్ర సభాస్థలాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

రూట్, సభా వేదిక స్థలం పరిశీలన

ఉరవకొండలో యాత్ర జరిగే రూట్, సభా వేదిక స్థలాన్ని విశ్వ స్థానిక నేతలతో కలిసి పరిశీలించారు. వేదిక ఏర్పాటు, తదితర అంశాలపై చర్చించారు. బస్సు యాత్రలో పాల్గొనే ప్రజానీకానికి అన్ని సౌకర్యాలు సక్రమంగా అందేలా ఏర్పాట్లు చేయాలని నాయకులకు సూచించారు.

ఎలక్ట్రీషియన్ కుటుంబానికి ఆర్థికసాయం



షఫీ కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందజేస్తున్న గురుప్రసాద్‌రెడ్డి

తాడిపత్రి : పట్టణంలోని పోరాట కాలనీలో నివసించే షేక్ షఫీ(బొంబాయి షఫీ) కిడ్నీల వ్యాధితో 3 నెలల క్రితం మృతి చెందారు. ఇతడు ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. షఫీ కుటుంబ సభ్యులకు ఆదివారం ఉమ్మడి గురుప్రసాద్‌రెడ్డి తన సేవా ట్రస్టు ద్వారా రూ. 5వేలు అందజేశారు.



బేకరీ వద్ద కేకులు కొనుగోలు చేస్తున్న ప్రజలు

ఘనంగా ఆంగ్ల నూతన సంవత్సర వేడుకలు

ప్రజాశక్తి-నార్పల

నార్పలలో ఆంగ్ల నూతన సంవత్సరం -2024 స్వాగత వేడుకలను అన్ని వర్గాల ప్రజలు ఘనంగా చేసుకున్నారు. మండల పరిధిలోని వివిధ గ్రామాల నుంచి ప్రజలు కేకులు కొనుగోలు చేయడానికి రావడంతో నార్పలలోని బేకరీలు జనాలతో కిక్కిరిసిపోయాయి. నూతన సంవత్సరం సందర్భంగా కొన్ని బేకరీలు కేకుల అమ్మకాలపై రాయితీలు కల్పించడంతో విద్యార్థులు, మహిళలు, చిన్నారులు కేకులు కొనడానికి ఎగబడ్డారు. నూతన సంవత్సరంలో అంతా మంచే జరగాలని పలువురు మిత్రులు కేకులు కోసుకుని ఒకరికొకరు తినిపించుకొని సంబరాలు చేసుకున్నారు. మండల ప్రజలకు తహశీల్దార్ హరికుమార్, ఎంపిడిఒ దివాకర్, ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి, ఎంఇఒ కృష్ణయ్య, ప్రజాప్రతినిధులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

తల్లిదండ్రుల చెంతకు తప్పిపోయిన బాలికలు

గుత్తి : రెండు రోజుల క్రితం తప్పిపోయిన గుత్తి పట్టణానికి చెందిన ఇద్దరు బాలికలను ఆదివారం పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించారు. పట్టణానికి చెందిన బాలికలు తప్పిపోయినట్లు తల్లిదండ్రులు చేసిన ఫిర్యాదు మేరకు సిఐ ఎం.వెంకటరామిరెడ్డి, ఎస్ఐ నబి రసూల్ దర్యాప్తు చేపట్టారు. తిరుపతిలో సంచరిస్తుండగా ఆ బాలికలను చేర దీసి గుత్తి పోలీస్ స్టేషన్లో తల్లిదండ్రులకు అప్పగించారు.



బాలికలను తల్లిదండ్రులకు అప్పజెప్పిన సిఐ వెంకటరామిరెడ్డి, ఎస్ఐ నబి రసూల్

ప్రజాశక్తి క్యాలెండర్‌ను ఆవిష్కరించిన 'ఆలం'

నార్పల : అనంతపురం నగరంలోని తన నివాసంలో ఆదివారం టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఆలం నరసా నాయుడు ప్రజాశక్తి-2024 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఆలం మాట్లాడుతూ 'ప్రజాశక్తి' దినపత్రిక కార్మికులు, కర్షకులు, బడుగు, బలహీన వర్గాలకు అండగా నిలుస్తూ, రాజకీయాలకు అతీతంగా నైతిక విలువలతో కథనాలు ప్రచురిస్తుందని కొనియాడారు. వాస్తవాలను నిర్భయంగా వెలికితీస్తూ ముందుకు సాగుతున్న ప్రజాశక్తి దినపత్రిక భవిష్యత్తులో మరింత అభ్యున్నతి సాధించాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, పాత్రికేయుడు షేర్‌ఖాన్ పాల్గొన్నారు.

నూతన సంవత్సర శుభాకాంక్షలు: ఎమ్మెల్సీ

ప్రజాశక్తి-ఉరవకొండ

అనంతపురం జిల్లా ప్రజలకు, ముఖ్యంగా ఉరవకొండ నియోజకవర్గం ప్రజలకు ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి ఆంగ్ల నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ నూతన సంవత్సరంలో ప్రజలందరూ సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, సంతోషంగా గడపాలన్నారు. ముఖ్యంగా సకాలంలో వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండి రైతులు ఆనందంగా ఉండాలని, వారికి ఆర్థికంగా కలిసి రావాలని ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి బడుగు, బలహీన, పేద ప్రజల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారన్నారు. అన్ని రంగాల్లో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలబెట్టడానికి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. నూతన సంవత్సరంలో కూడా సంక్షేమ ఫలాలు అందరికీ చేరి పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలందరూ అభివృద్ధిలోకి రావాలని ఆకాంక్షించారు.



వైఎస్ఆర్ పింఛను రూ.3వేలకు పెంపు

ప్రజాశక్తి-పుట్లూరు

ప్రభుత్వం పింఛను మొత్తాన్ని రూ. 2,750 నుంచి రూ. 3వేలకు పెంచింది. 2024 జనవరి 1 నుంచి 8వ తేదీ వరకూ అన్ని మండల కేంద్రాల్లో పింఛను పెంపు మహోత్సవాలను పండుగ రీతిలో జరుపుకోవాలని ప్రభుత్వం నిర్ణయించిందని ఎంపిడిఒ యోగానందరెడ్డి తెలిపారు. మండల స్థాయిలో 1 నుంచి 8వ తేదీ వరకూ చేపట్టే కార్యక్రమంలో ప్రజాప్రతినిధులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. వాలంటీర్లందరూ ఎప్పటిలాగే పింఛనుదారుల ఇంటి వద్దకే వెళ్లి పింఛను మొత్తం రూ. 3వేలు అందజేస్తారని, సిఎం లేఖను లబ్ధిదారులకు అందజేస్తారన్నారు.

చరిత్ర పరిశోధనకు యువత ముందుకు రావాలి

సిడబ్ల్యూసి సభ్యులు ఎన్.రఘువీరారెడ్డి

ప్రజాశక్తి-హిందూపురం

నాటి రాజుల చరిత్రను నేటి నాయకులు మార్గదర్శకంగా తీసుకొని ప్రజలకు ఆదర్శ పాలన అందించాలని , యువత చరిత్ర పరిశోధనకు ముందుకు రావాలని మాజీ మంత్రి, సిడబ్ల్యూసి సభ్యులు ఎన్. రఘువీరా రెడ్డి అన్నారు. పట్టణంలోని ఎంజీఎం మున్సిపల్ ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయులు సిద్ధగిరి శ్రీనివాస్ హేమావతి ఇది వత్తాంతంతో రచించిన నోళంబవాడి పుస్తకాన్ని ఆదివారం సాయంత్రం మహర్షి వాల్మీకి భవన్‌లో ఆవిష్కరించారు. ప్రముఖ కవి, రచయిత సడ్లపల్లి చిదంబర రెడ్డి అధ్యక్షత జరిగిన ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా రఘువీరాతో పాటు మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు సుధాకర్, కెటి శ్రీధర్, ఎస్కేయు ప్రొఫెసర్ సదాశివారెడ్డి, కేంద్ర సాహిత్య అకాడామి అవార్డు గ్రహీత బండి నారాయణ స్వామి, డాక్టర్ హరినాథ్ రెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రఘువీరా రెడ్డి మాట్లాడుతు స్థానిక చరిత్రతో ముడిపడిన ఈ పుస్తకాన్ని ప్రతి పాఠశాల, కళాశాలలో విద్యార్థులకు అందుబాటులో ఉంచాలని సూచించారు. గతంలో తాము లేపాక్షి, పెనుకొండ ఉత్సవాలు నిర్వహించటంతో వీటి ప్రాముఖ్యత దేశం నలుమూలలకు ప్రాకి నేడు పర్యాటకుల తాకిడి పెరిగిందన్నారు. ఈ సందర్భంగా రచయిత ఒంటేరు శ్రీనివాసులు పుస్తక సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు అంబికా లక్ష్మీనారాయణ, పిసిసి ఉపాధ్యక్షులు బాలాజి మనోహర్, ఆదినారాయణ, ధనాపురం వెంకట్రామిరెడ్డి, కాలువ హరిత, ఆశ్వర్థనారాయణరెడ్డి, ఎంపిడిఒ నరేంద్ర కుమార్, ఎంఇఒ గంగప్ప, రచయిత శాంతి జయ ప్రకాశ్‌తో పాటు కవులు, రచయితలతో పాటు వివిధ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.



నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న జిల్లా అధ్యక్షులు హరిగోపాల్



మనోహర్

ఎస్సీ రిజర్వేషన్లు, వర్గీకరణే లక్ష్యంగా పని చేయాలి

ప్రజాశక్తి-రాయదుర్గం

ఎస్సీ రిజర్వేషన్లు, వర్గీకరణ లక్ష్యంగా పని చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు హరి గోపాల్ పిలుపునిచ్చారు. పట్టణంలోని సెయింట్ థామస్ స్కూల్‌లో ఆదివారం పట్టణ ఎమ్మార్పీఎస్ నాయకులతో సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథి హరిగోపాల్ మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు గ్రామ, మండల, నియోజకవర్గ కమిటీలను ఏర్పాటు చేస్తున్నామని, అందులో భాగంగా రాయదుర్గం పట్టణ కమిటీని ఏర్పాటు చేశామన్నారు. అధ్యక్షుడిగా మనోహర్, ఉపాధ్యక్షుడిగా తిప్పేస్వామి, ప్రధాన కార్యదర్శిగా యేసుఫ్, కార్యవర్గ సభ్యులుగా శ్రీధర్, హరీష్, శివ, ఆంజనేయులును ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పెన్నప్ప, నియోజకవర్గ అధ్యక్షులు వన్నూరుస్వామి, ఉపాధ్యక్షులు గోవింద పాల్గొన్నారు.

అపుస్మా క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-అనంతపురం

జిల్లా ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం 2024 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. జిల్లా అపుస్మా అధ్యక్షులు కుసుమ పుల్లారెడ్డి అధ్యక్షన రాష్ట్ర అపుస్మా ప్రధాన కార్యదర్శి తులసి విష్ణుప్రసాద్, రాష్ట్ర చీఫ్ కోఆర్డినేటర్ రామిరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుల ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను జిల్లా విద్యాశాఖాధికారి నాగరాజు ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షుడు నాయుడు, రాష్ట్ర అపుస్మా ఉపాధ్యక్షులు సుబ్బారెడ్డి, రాష్ట్ర కన్వీనర్ నాగరాజుశ్రీనాథ్, జిల్లా కోశాధికారి ఇక్బాల్, శ్రీనాథ్, రవీంద్రారెడ్డి, రామచంద్రారెడ్డి, అన్వర్, నారాయణరెడ్డి, సుగుణాకర్, మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, జలీల్, లక్ష్మన్న, తదితరులు పాల్గొన్నారు.




అపుస్మా క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

జిసిటిఎ క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-అనంతపురం

ఎస్కేయూలోని విసి ఛాంబర్‌లో ఆదివారం జిసిటిఎ జిల్లా కార్యదర్శి డాక్టర్ కొనంకి శ్రీధర్ ఆధ్వర్యంలో విసి ప్రొఫెసర్ చింతా సుధాకర్ జిసిటిఎ రాష్ట్ర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. విసి అధ్యాపకులందరికీ ఆంగ్ల నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. జిసిటిఎ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ కొనంకి శ్రీధర్ విసితో పాటు జిల్లాలోని ప్రిన్సిపళ్లు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బందికి ఆంగ్ల నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి జి.రాజశేఖర్, ఆర్ట్స్ కళాశాల యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు యోగేశ్వర్‌నాయుడు, అచ్యుతానంద, ధర్మవరం కళాశాల అధ్యక్షులు కిరణ్‌కుమార్, ఆర్ట్స్ కళాశాల సీనియర్ అధ్యాపకులు, విజయ్‌కుమార్, బాలాజీనాయక్, తిరుమలేష్, తదితరులు పాల్గొన్నారు.



ఎస్కేయూ విసి చింతా సుధాకర్‌కు ఆంగ్ల నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న జిసిటిఎ నాయకులు

విద్యుత్ స్టార్టర్ బాక్స్ చోరీ

బెళుగుప్ప : మండల పరిధిలోని వెంకటాద్రిపల్లి సమీపంలో ఉన్న ఆరెకరాల పొలాన్ని అనకనహాల్ గ్రామానికి చెందిన రైతు రంగన్నగౌడ్ కౌలుకు తీసుకొని బోరుబావి కింద పంటలు సాగు చేస్తున్నారు. విద్యుత్ స్తంభానికి అమర్చిన స్టార్టర్ బాక్సును, ఒక ఎకరా డ్రిప్ వైరు రూ. 15 వేల విలు వ చేసే వస్తువులను శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారని బాధిత రైతు తెలిపారు.

వైసిపిది అరాచక పాలన
కందికుంట

ప్రజాశక్తి కదిరి అర్బన్



రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అరాచక పాలన సాగిస్తోందని మాజీ ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ విమర్శించారు ఈ మేరకు ఆయన ఆదివారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జగన్ తన పాదయాత్రలో ఇచ్చిన హామీలు 85శాతం అమలు చేయలేదని విమర్శించారు. ప్రజలకు మోసం చేసిన ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. నవరత్నాల పేరుతో నవ మోసాలు చేశారని ఎద్దేవా చేశారు. తమ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర వ్యాప్తంగా సర్వ శిక్ష అభియాన్, అంగన్వాడీ, మున్సిపల్ కార్మికులు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవటం దారుణమన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి నాలుగున్నర సంవత్సర కాలంలో ప్రజలకు మభ్యపెట్టి ఇబ్బందులు పెట్టిన విధానాన్ని తెలుసుకొని ప్రజల సంక్షేమం కోసం పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో టిడిపి పట్టణ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్, టిడిపి నాయకులు రాజశేఖర్ బాబు తదితరులు పాల్గొన్నారు.